

# మనం


## కడప | అన్నమయ్య

## వై.వీ.యూ తెలుగు పరిశోధకుడు దేవరపల్లి విశ్వనాథ్‌కు డాక్టరేట్



ఓబులవారిపల్లి ,అక్టోబర్ 31, మనం న్యూస్: తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండలం జెడ్ హెచ్ డి సి కాలనీ-2 గ్రామం అంజనేయులు నరసమ్మ దంపతుల కుమారుడు దేవరపల్లి విశ్వనాథ్ యు.జీ. సి. నేషనల్ ఫెలోషిప్ అర్హత సాధించి, యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు పాలెం రమాదేవి గారి పర్యవేక్షణలో ఒక దశాబ్ది రాయలసీమ కథలు – విశ్లేషణ (2011-2020) అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించినందుకు పిహెచ్.డి డాక్టరేట్ లభించింది. ఆయన పరిశోధన పత్రాలు ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితం అయ్యాయి. విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బెల్లకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య జి. గంగిరెడ్డి, వై. వీ. యూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. శ్రీనివాసులు, తెలుగు శాఖ అధ్యాపకులు పరిశోధక విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

# పుర సమరం నేడే..




**పులివెందులలో హైటెన్షన్!**

**ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్**

**కడప కార్పొరేషన్ సహా 6 పురపాలికల్లో విస్తృత ఏర్పాట్లు**

**బరిలో 336 మంది.. 4.39 లక్షల మంది ఓటర్ల చేతుల్లో భవితవ్యం**

మనం ప్రతినిధి కడప అక్టోబర్ 31

“ జిల్లాలో పురపోరు రణరంగం తుది ఘట్టానికి చేరింది. పురపాలికల్లో ‘సై అంటే సై’ అంటూ తలపడుతున్న ప్రధాన పార్టీల మధ్య పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగుతుందా లేక ఘర్షణలకు దారితీస్తుందా అన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పులివెందులలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకోనుండటంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తకర పరిస్థితులు నెలకొనగా, జమ్మలమడుగు, కడప పట్టణాల్లోనూ తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రత్యర్థి వర్గాలు తమ అనుచరులు, ప్రైవేట్ సైన్యాన్ని భారీగా రంగంలోకి దించాయన్న ప్రచారంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటాయోనని ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేయడంపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో మున్సిపల్ పోలింగ్ ప్రక్రియను శాంతియుతంగా ముగించడం పోలీసు యంత్రాంగానికి పెను సవాల్‌గా మారింది. రాజకీయ ఒత్తిళ్లు, గుంపుల మోహరింపులను కట్టడి చేసేందుకు జిల్లావ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను రంగంలోకి దించారు. ఓటర్లు ఎలాంటి భయాలకు గురికాకుండా నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు భరోసా ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నడుమ నేటి పోలింగ్ ఘట్టం ఎలా ముగుస్తుందనేది సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.”

### పురపోరు తుది ఘట్టం.. మోగనున్న పోలింగ్ నగారా

?నెలల తరబడి కొనసాగిన ప్రచార హోరు, వ్యూహాలు, ప్రతివ్యూహాలు, మాటల తూటాలకు తెరపడగా.. నేడు అసలైన ప్రజా తీర్పునకు సమయం ఆసన్నమైంది. కడప నగరపాలక సంస్థతో పాటు బద్వేల్, ఎర్రగుంట్ల, రాజంపేట, పులివెందుల, జమ్మలమడుగు, మైదుకూరు పురపాలికల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రక్రియ మొదలుకానుంది. సాయంత్రం 5 గంటల వరకు ఓటర్లు తమ హక్కును వినియోగించుకోవచ్చు. మొత్తం 4,39,035 మంది ఓటర్లు తమ తీర్పును బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేయనుండగా.. 336 మంది అభ్యర్థుల రాజకీయ భవితవ్యం తేలనుంది.

### హాట్‌స్పాట్‌గా పులివెందుల.. తీవ్ర ఉత్కంఠలో జమ్మలమడుగు, కడప

రాజకీయంగా అత్యంత సున్నితమైన పులివెందుల, జమ్మలమడుగు, కడప పట్టణాల్లో పోటీ తీవ్ర స్థాయికి చేరడంతో సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రత్యేకించి పులివెందులలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకోనుండటంతో అక్కడ భద్రతా ఏర్పాట్లపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఒక్కో ఓటూ అత్యంత కీలకంగా మారిన తరుణంలో, పోలింగ్ సరళిపై ప్రధాన పార్టీల అధిష్ఠానాలు నిశితంగా దృష్టి సారిస్తున్నాయి.

### మోహరించిన అనుచరగనులు ..

### శాంతిభద్రతలకు సవాల్

?ఎన్నికల నేపథ్యంలో ప్రధాన రాజకీయ వర్గాలు తమ కార్యకర్తలు, అనుచరులను పెద్ద సంఖ్యలో మోహరించినట్లు వార్తలు వస్తున్నాయి. ఓటర్లను సమన్వయం చేసుకోవడం, ప్రత్యర్థి వర్గాల కదలికలను కనిపెట్టే నెపంతో పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో గుంపులుగా చేరి వాగ్వాదాలు, ఘర్షణలకు దిగే అవకాశముంది. ఈ పరిణామాల వల్ల సామాన్య ఓటర్లు భయాందోళనలకు గురికాకుండా చూడటం, ఉద్రిక్తతలకు తావులేకుండా ప్రశాంత వాతావరణం కల్పించడం పోలీసు యంత్రాంగానికి పెను సవాల్‌గా మారింది.

### అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 272 ప్రాంతాల్లో 560 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. వీటిలో శాంతిభద్రతల దృష్ట్యా 180 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా, 155 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో కేంద్ర బలగాలు, ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించి పహారా కాస్తున్నారు.

### వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణ.. విధుల్లో వేలాది సిబ్బంది

ఓటింగ్ ప్రక్రియ నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నారు. 335 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యక్ష వెబ్‌కాస్టింగ్ ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించనున్నారు. మరో 138 ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. ఈ భారీ ఎన్నికల విధులకు 3,864 మంది పోలింగ్ సిబ్బందిని, క్షేత్రస్థాయి పరిశీలన కోసం 208 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు.

### నిర్భయంగా ఓటేయండి: కలెక్టర్, ఎస్పీ పిలుపు

ఓటర్లు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు, ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ విజ్ఞప్తి చేశారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.నేడు బ్యాలెట్ పెట్టెల్లో భద్రమయ్యే ప్రజా తీర్పు నవంబర్ 3న చేపట్టే ఓట్ల లెక్కింపుతో తేటతెల్లం కానుంది.

# రాజంపేట మున్సిపల్ పోరుకు సర్వం సిద్ధం

**ఎన్నికలకు పటిష్టపోలీసుల బందోబస్తు! – ప్రతి పోలింగ్ బూత్‌లోనూ సీసీ కెమెరాల డేగకన్ను**

**14 పోలింగ్ కేంద్రాలు.. 2 జోన్లుగా విభజన – రంగంలోకి 4 సిఐలు, 8 ఎస్ఐలు, 220 మంది బలగాలు**

**స్థానికేతరులు వెంటనే పట్టణం విడిచి వెళ్లాల్సిందే! – ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి**

**అలజడి సృష్టిస్తే ముందస్తు అరెస్టులు ఖాయం: డీఎస్పీ వెంకట్రామయ్య తీవ్ర హెచ్చరిక**




(మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 31)

“ రాజంపేట మున్సిపల్ ఎన్నికలు పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు రాజంపేట డీఎస్పీ వెంకట్రామయ్య వెల్లడించారు. పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేస్తూ ప్రతి ఓటరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట పోలీసు రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.’

### ప్రతి పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాల నిఘా

ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రతి పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియను, కేంద్రాల పరిసరాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పారదర్శకతను కాపాడటానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా వెబ్‌కాస్టింగ్ నిఘా కొనసాగుతుంది.

### రెండు జోన్లుగా 14 పోలింగ్ స్టేషన్లు

రాజంపేట పట్టణ పరిధిలోని మొత్తం 14పోలింగ్ కేంద్రాలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు వీలుగా 2 ప్రత్యేక జోన్లుగా విభజించారు. ప్రతి జోన్‌కు ఒక సీనియర్ అధికారి నేతృత్వంలో పర్యవేక్షణ బృందాలను, త్వరితగతిన స్పందించే క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను (ుఒ=) రంగంలోకి దించారు.

### భారీ పోలీసు బలగాల మోహరింపు

శాంతిభద్రతల పరిరక్షణ కోసం భారీ స్థాయిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 4 గురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 8 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లు, 220 మంది పోలీసుసిబ్బందితో నిరంతర బందోబస్తు, మొబైల్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

### అలజడులు సృష్టిస్తే ముందస్తు అరెస్టులు

ఎవరైనా పోలింగ్ కేంద్రాల వద్ద గానీ, పట్టణంలో గానీ గొడవలు పడినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించినా క్షమించేది లేదని డీఎస్పీ తేల్చిచెప్పారు. అనుమానితులను, సమస్యలు సృష్టించే వారిని గుర్తించి ముందస్తుగా అరెస్టులు చేస్తామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

### స్థానికేతరులు వెంటనే పట్టణం వీడాలి

రాజంపేట ఓటర్లు కాని ఇతర ప్రాంతాల వ్యక్తులు ఎవరైనా పట్టణంలో ఉంటే తక్షణమే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. స్థానిక లాడ్జీలు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో తనిఖీలు కొనసాగుతున్నాయని, అనధికార వ్యక్తులు కనిపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

### నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి

ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్లందరూ ఎలాంటి భయాలు, ఒత్తిళ్లకు తావులేకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని డీఎస్పీ వెంకట్రామయ్య పిలుపునిచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని విధాలా భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

# ఓటు హక్కును సద్వినియోగించుకోండి

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి**




కడప, అక్టోబరు 31 మనంన్యూస్ :ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు ఎంతో విలువ ఉందని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు – 2026 లో భాగంగా మున్సిపల్ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ నవంబర్ 1వ తేదీన (ఆదివారం) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఓటరు జాబితాలో పేరున్న ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానిని వెంట తీసుకుని తమ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఉత్సాహంగా, బాధ్యతాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ ఎన్నికల్లో ఓటర్లకు రెండు బ్యాలెట్ పత్రాలు అందజేస్తారని, గులాబీ రంగు బ్యాలెట్ పత్రం మేయర్ అభ్యర్థికి, తెలుపు రంగు బ్యాలెట్ పత్రం కార్పొరేటర్ అభ్యర్థికి ఓటు వేసేందుకు ఉంటుందని వివరించారు. ఓటు వేసిన అనంతరం రెండు బ్యాలెట్ పత్రాలను ఒకే బ్యాలెట్ పెట్టెలో వేయాలని తెలిపారు. జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేయాలని, ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

### ఓటు వేసేందుకు తీసుకెళ్లాల్సిన గుర్తింపు కార్డులు

ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, పాస్‌పోర్టు, తపాలా కార్యాలయ పొదుపు ఖాతా పుస్తకం, ఉపాధి హామీ పథకం గుర్తింపు కార్డు, ఆరోగ్య బీమా కార్డు, పెన్షన్ పత్రం, ఉద్యోగ గుర్తింపు కార్డు, జాతీయ జనాభా పట్టిక స్మార్ట్ కార్డు, ఎంపీ/ ఎమ్మెల్యే/ ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానిని వెంట తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, అక్టోబర్ 31 మనం న్యూస్ : స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ పోలింగ్ సిబ్బంది, ఓటర్లు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సూచించారు. నవంబర్ 1వ తేదీన స్థానిక సంస్థల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో... పోలింగ్ కేంద్రాల్లోకి ఎవరెవరు ప్రవేశించవచ్చు, ఓటర్లు అనుసరించాల్సిన విధానం, ఎన్నికల సిబ్బంది విధులు, నిషేధిత చర్యలపై ఆయన పలు మార్గదర్శకాలను జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

**పోలింగ్ కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు**

ఓటర్లు, వారితో వచ్చే చిన్నపిల్లలు, ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ సిబ్బంది, అభ్యర్థులు, వారి ఎన్నికల ఏజెంట్లు, నిబంధనల ప్రకారం అనుమతి పొందిన వ్యక్తులు మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించాలి.

అంధులు, శారీరక వైకల్యం లేదా అనారోగ్యం కారణంగా స్వయంగా నడవలేని ఓటర్లు తమ వెంట ఒక సహాయకుడిని తీసుకెళ్లవచ్చు.

ఓటర్లు తమ గుర్తింపు కోసం ఓటరు గుర్తింపు కార్డు లేదా ఎన్నికల సంఘం అనుమతించిన ఇతర గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి చూపించాలి. ఆధార్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్ కార్డు, ఫొటోతో కూడిన పదో తరగతి ధ్రువపత్రం, నిర్దేశిత బ్యాంకు పాస్‌బుక్ తదితర పత్రాలను గుర్తింపునకు ఉపయోగించవచ్చు.

ఎడమచేతి చూపుడు వేలికి వేసిన చెరగని సిరాను తనిఖీ చేయించుకుని, ఓటర్ల జాబితాలో పేరు పరిశీలన అనంతరం సంతకం లేదా వేలిముద్ర వేయాలి.

బ్యాలెట్ పత్రం ద్వారా ఓటు వేసే సమయంలో ఓటింగ్ గదిలోకి వెళ్లి, తమకు నచ్చిన అభ్యర్థి గుర్తు పక్కన నిర్దేశిత విధంగా ఓటు వేసి, బ్యాలెట్ పత్రాన్ని మడిచి బాక్సులో వేయాలి.

ఓటు వేసిన వెంటనే పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లాలి. ఓటింగ్ సమయంలో అనవసర జాప్యం చేయరాదు.

పోలింగ్ ప్రారంభానికి ముందు ఖాళీ బ్యాలెట్ పెట్టెను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు చూపించి, వారి సమక్షంలోనే ముద్ర వేయాలి.

ఒకేసారి పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే ఓటర్ల సంఖ్యను ప్రిసైడింగ్ అధికారి నియంత్రిస్తారు.

పోలింగ్ కేంద్రాల్లో నిషేధిత చర్యలు..పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, ఓట్లు అభ్యర్థించడం నిషేధం.

ఓటర్లను వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించరాదు.

పోలింగ్ కేంద్రంలో లేదా పరిసర ప్రాంతాల్లో గొడవలు చేయడం, ఎన్నికల సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడం, అధికారులను అడ్డుకోవడం చేయరాదు.

ఇతరుల పేరుతో ఓటు వేయడం, దొంగ ఓటుకు పాల్పడటం చట్టరీత్యా నేరం.

ఒకేసారి ఇద్దరు ఓటర్లు ఒకే ఓటింగ్ గదిలోకి ప్రవేశించరాదు.ఓటు గోప్యతకు భంగం కలిగించేలా బ్యాలెట్ పత్రాల వివరాలను నమోదు చేయడం లేదా ఇతర చర్యలకు పాల్పడరాదు. పొగాకు ఉత్పత్తులను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకురావడం నిషేధం. మొబైల్ ఫోన్లు, కెమెరాలను ఓటింగ్ గదిలోకి తీసుకెళ్లడం, ఓటు వేసే విధానాన్ని చిత్రీకరించడం చేయరాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు అభ్యర్థిగా లేదా ఓటరుగా మినహా ఇతర హోదాల్లో పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించరాదు. పోలింగ్ కేంద్రాల వెలుపల ఓటర్లకు ఆహారం, మద్యం పంపిణీ చేయరాదు.

సమస్యలుంటే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాళి

పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు లేదా ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకుంటే అభ్యర్థులు, వారి ఏజెంట్లు జిల్లా ఎన్నికల అధికారి లేదా ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు. అంతేకానీ పోలింగ్ కేంద్రాల్లో గందరగోళం సృష్టించడం, ఎన్నికల సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడరాదన్నారు.

ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను గౌరవించాలని, ఓటు హక్కు వినియోగించుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని కలెక్టర్ కోరారు. అంతేకాకుండా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.




## అనంతరాజుపేట-1లో 3వ రోజుకు చేరిన ఎంపీటీసీ ఎన్నికల విస్తృత ప్రచారం

### లక్ష్మీనగర్‌లో ఎన్డీఏ అభ్యర్థి పోలు బుజ్జి ఇంటింటి ప్రచారం

రైల్వే కోడూరు, అక్టోబర్ 31, మనం న్యూస్ : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండల పరిధిలోని అనంతరాజుపేట-1 ఎంపీటీసీ స్థానంలో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది. ఎన్డీఏ కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పోలు బుజ్జి తరఫున శనివారం నాటికి మూడవ రోజు ప్రచారం అత్యంత ఉత్సాహంగా కొనసాగింది. సైకిల్ గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ శనివారం సాయంత్రం లక్ష్మీనగర్‌లో ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి నిర్వహించిన ఇంటింటి ప్రచారం అత్యంత వైభవంగా సాగింది. ఈ సందర్భంగా అభ్యర్థి పోలు బుజ్జి లక్ష్మీనగర్‌లోని ప్రతి ఇంటి గడపకూ వెళ్లి ఓటర్లను ప్రత్యక్షంగా కలిశారు. అనంతరాజుపేట గ్రామంలోని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రాంత అభివృద్ధికి నా వంతు తోడ్పాటు అందిస్తానని ఆమె స్పష్టం చేశారు. తనకు ఒక్క మంచి అవకాశం ఇచ్చి, ఎంపీటీసీ-1 పరిధిలో సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా గ్రామస్థులను పేరుపేరునా వేడుకున్నారు. ప్రచారంలో భాగంగా లక్ష్మీనగర్ వాసులు అభ్యర్థి పోలు బుజ్జికి, ఎన్డీఏ కూటమి నాయకులకు ఘనస్వాగతం పలికి తమ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


## భాస్కర్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించిన నంద్యాల రాఘవరెడ్డి



ప్రొద్దుటూరు మనం న్యూస్ అక్టోబర్ (31):ప్రొద్దుటూరు పట్టణం కోట వీధికి చెందిన భాస్కర్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందారని తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి ఆయన భౌతిక గాయాన్ని శనివారం సందర్శించి పుష్పగుచ్ఛంతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాస్కర్ రెడ్డి వ్యాపార రంగంలో రానించి ఉన్నత స్థాయికి ఎదిగారని కొనియాడారు. భాస్కర్ రెడ్డి నివాసముండే ప్రాంతంలో అందరితో కలిసి మెలిసి ఉంటూ అందరి మన్ననలు పొందారని అన్నారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాజీ కౌన్సిలర్ గాండ్ల నారాయణస్వామి 8వ వార్డు కౌన్సిలర్ గాండ్ల వినీత తదితరులు ఉన్నారు.

## వైసీపీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పని చేయాలి

### - కొండూరు అజయ్ రెడ్డి



పెనగలూరు(అక్టోబర్ 31),మనంన్యూస్: పెనగలూరు మండలం లో వైసీపీ తరుపున పోటీ చేస్తున్న ఎంపీటీసి, జడ్పిటీసి అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని కడప పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కొండూరు అజయ్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం అనంతంపల్లి ఎంపీటీసి పరిధిలోని గ్రామాలలో ఆయన అనంతంపల్లి ఎంపిటిసి అభ్యర్థి పొగడతోటి శిరీష, జడ్పిటీసి అభ్యర్థి దువూరి సుప్రజ లతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. అభ్యర్థుల గుర్తు వైసీపీ ఫ్యాన్ కు ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేరం రెడ్డయ్య నాయుడు, ముద్రపల్లి మాజీ సర్పంచి యలమంచి శివయ్య నాయుడు, రవి నాయుడు, యువ నాయకుడు కురుగుంట్ల హరి చౌదరి, కురుగుంట కృష్ణయ్య నాయుడు, చాగల ఉమా మహేశ్వరుడు, యాపాటి రమేష్, దువూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


## వైభవంగా కోదండ రామునికి స్నపన తిరుమంజనం సేవ



ఒంటిమిట్ట అక్టోబర్ 31 (మనం న్యూస్) రెండవ అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో శనివారం ఉదయం స్నపన తిరుమంజనం సేవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ముందుగా టిటిడి అర్చకులు,అధికారులు స్వామి వారి నూతన పట్టు వస్త్రాలు పూజా సామగ్రితో ఆలయ ప్రదక్షిణ చేశారు.అనంతరం గర్భాలయంలోని సీతారామలక్ష్మణమూర్తులను పవిత్ర జలాలు,సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు.స్నపన తిరుమంజనం సేవ తర్వాత భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

# ప్రొద్దుటూరు సహకార గృహ నిర్మాణ సంఘం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

### సొసైటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాం: నూతన చైర్మన్ ఓబుళరెడ్డి



ప్రొద్దుటూరు మనం న్యూస్ : అక్టోబర్ (31) ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో 'ది ప్రొద్దుటూరు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ' నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి మాట్లాడుతూ.. 76 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సొసైటీ సుమారు 12 వేల మంది సభ్యులతో మూడు కాలనీలను అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు. ఇటీవల జరిగిన అవకతవకల వల్ల సంస్థ కుంటుపడటంతో పాత కమిటీని రద్దు చేసి, నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సొసైటీ చైర్మన్, విశ్రాంత అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఓబుళరెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో నాగిరెడ్డి, శ్రీనివాసులు, చంద్రమోహన్‌రెడ్డి, వద్ది ఓబులేసులతో కూడిన నూతన కమిటీ బాధ్యతలు చేపట్టిందన్నారు.

బైలాలో అవసరమైన మార్పులు చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తాం. పాత మాన్యువల్ ఖాతాలను పూర్తిగా కంప్యూటరీకరిస్తాం.

సొసైటీకి సంబంధించిన మొండి బకాయిలను త్వరితగతిన వసూలు చేస్తాం.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తాం. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మార్కెట్ యార్డు ఇన్‌చార్జి చైర్మన్ పట్నం లక్ష్మణ్ కుమార్, జెడ్పిటిసి బచ్చల ప్రతాప్, సినీస్టార్ గంజికుంట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం

### నవంబర్ 2న చిట్వేలి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రం

చిట్వేలి అక్టోబర్ 31 మనం న్యూస్: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధులకు నియమించబడిన అర్హులైన సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు చిట్వేలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు మండల రిటర్నింగ్ అధికారి జి. జయభరత్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వుల మేరకు నవంబర్ 2వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.ఎన్నికల విధులకు నియమించబడిన పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులైన సిబ్బంది నిర్ణీత తేదీ, సమయాల్లో చిట్వేలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి హాజరై తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

## బెటాలియన్‌లో 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమం

సిద్ధవటం అక్టోబర్ 31(మనం న్యూస్) రాష్ట్రీయ ఏక్తా దివస్ -2026 కార్యాక్రమములో భాగంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఏపియస్పీ 11వ బెటాలియన్లో శనివారం 'రన్‌ఫర్‌యూనిటీ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కమాండెంట్ కె.ఆనందరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# అనంతరాజుపేట-2లో జనసేన దూకుడు

### జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల విజయం కోసం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విస్తృత ప్రచారం



రైల్వే కోడూరు, అక్టోబర్ 31, మనం న్యూస్ : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండల పరిధిలోని అనంతరాజుపేట-2 ఎంపీటీసీ స్థానంలో ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. స్థానిక నియోజకవర్గ శాసనసభ్యులు అరవ శ్రీధర్ శనివారం సాయంత్రం అనంతరాజుపేట-2 పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించి, జనసేన పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు.

ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా అనంతరాజుపేట-2 ఎంపీటీసీ స్థానం నుంచి జనసేన పార్టీ తరఫున బరిలో నిలిచిన అభ్యర్థి మొలకల సుబ్రహ్మణ్యం మరియు రైల్వే కోడూరు జడ్పీటీసీ స్థానం నుంచి కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి పగడాల వెంకటేశ్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థితో పాటు, నియోజకవర్గంలోని 24 ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులందరినీ గెలిపించండి. అభివృద్ధి మన ముఖద్వారం వద్దకే రావాలంటే, మన కూటమి గుర్తులపై ఓటు వేసి వారిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి" అని పిలుపునిచ్చారు. ప్రచారంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కేసంశెట్టి బలరామయ్య మరియు గ్రామస్తులు, కూటమి కార్యకర్తలు ఎమ్మెల్యేకు అఖండ ఘనస్వాగతం పలికారు.

# పిల్లల భవిష్యత్తుకు తల్లిదండ్రులే తొలి గురువులు

## పిల్లల విద్య, మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రుల శ్రద్ధ ఎంతో అవసరం : కౌన్సిలర్ డక్కిలి సుబ్రమణ్యం



చిట్వేలి అక్టోబర్ 31 మనం న్యూస్: తిరుపతి జిల్లా, చిట్వేలీ మండలం నాగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులకు పిల్లల విద్యాభివృద్ధి, మానసిక ఆరోగ్యం, భద్రత, సమగ్రాభివృద్ధిపై కెరీర్ మరియు మానసిక ఆరోగ్య కౌన్సిలర్ డక్కిలి సుబ్రమణ్యం ప్రత్యేక అవగాహన సందేశాన్ని అందించారు. మీ బిడ్డలు మీ ఆస్తి.. వారి భవిష్యత్తు మీ బాధ్యత!" అనే సందేశంతో ఆయన తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పిల్లలను పాఠశాలకు పంపించడంతోనే తమ బాధ్యత పూర్తయిందని భావించకుండా, వారి చదువు, ప్రవర్తన, మానసిక స్థితి, స్నేహాలు, అలవాట్లను నిరంతరం గమనించాలని సూచించారు. ప్రతి తల్లిదండ్రి రోజుకు కనీసం పది నిమిషాలైనా పిల్లలతో కేటాయించి, పాఠశాలలో ఏమి నేర్చుకున్నారు, ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆప్యాయంగా మాట్లాడాలని కోరారు. నెలకు కనీసం ఒకటి రెండుసార్లు పాఠశాలను సందర్శించి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పిల్లల విద్యాభివృద్ధి, హాజరు, ప్రవర్తన, స్నేహ సంబంధాల గురించి తెలుసుకోవాలని, ప్రతి పేరెంట్స్ మీటింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల భవిష్యత్తును ప్రభావితం చేసేవి కేవలం పాఠ్యపుస్తకాలే కావని, వారి స్నేహాలు, పరిసరాలు, అలవాట్లు కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని వివరించారు. మొబైల్ వినియోగం, ఆన్‌లైన్ గేమ్స్, సోషల్ మీడియా వంటి అంశాలపై తల్లిదండ్రులు తగిన శ్రద్ధ చూపాలన్నారు. పిల్లల్లో ఆకస్మిక ప్రవర్తనా మార్పులు కనిపిస్తే మందలించడం, అనుమానించడం కంటే ప్రేమతో మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకోవాలని సూచించారు. పిల్లలను నియంత్రించడం కంటే అర్థం చేసుకోండి.. భయపెట్టడం కంటే నమ్మకాన్ని పెంచండి.. వారి స్నేహాలను నిషేధించడం కంటే మంచి స్నేహాలను గుర్తించే విచక్షణను పెంపొందించండి" అని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల తప్పులను సమర్థించకుండా, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ సరైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు. మన బిడ్డ ఎదగాలి.. ఎదుటివారి ఎదుగుదలకు అడ్డంకి కాకూడదని, ప్రతి విద్యార్థి బాధ్యతగల పౌరుడిగా ఎదిగేలా కుటుంబం, పాఠశాల కలిసి కృషి చేయాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలంలో కెరీర్ మరియు మానసిక ఆరోగ్య కౌన్సిలర్లను నియమించిందని, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భద్రత, విద్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శకత్వం కోసం తల్లిదండ్రులు కౌన్సిలర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

"రోజూ పది నిమిషాల శ్రద్ధ.. నెలకు కనీసం రెండుసార్లు పాఠశాల సందర్శన. ప్రతి పేరెంట్స్ మీటింగ్‌కు హాజరు. ఇవి పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పెట్టగలిగే అత్యంత విలువైన పెట్టుబడులు" అని పేర్కొన్నారు. పిల్లల సమగ్రాభివృద్ధి కోసం పాఠశాల, తల్లిదండ్రులు, కౌన్సిలర్ సమన్వయంతో పనిచేసి, పిల్లల సమస్యలను గుర్తించి, వారి ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. పిల్లల భవిష్యత్తు వారి ఒక్కరి బాధ్యత కాదు.. మనందరి సమష్టి బాధ్యత" అని ఈ సందర్భంగా డక్కిలి సుబ్రమణ్యం స్పష్టం చేశారు



# ప్రజా సేవే లక్ష్యంగా ఎల్వీ మోహన్ రెడ్డి

## చిట్వేలి జడ్పీటీసీ అభ్యర్థిగా వైఎస్సార్సీపీ తరపున ఎన్నికల బరిలో సీనియర్ నాయకుడు

చిట్వేలి అక్టోబర్ 31 మనం న్యూస్: తిరుపతి జిల్లా, చిట్వేలి మండలం దేమాంచుపల్లి పంచాయతీకి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్వీ మోహన్ రెడ్డి మండల జడ్పీటీసీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. రాజకీయ రంగంలో తనకున్న అనుభవం, స్థానిక ప్రజలతో ఉన్న పరిచయాలు, గతంలో నిర్వహించిన గ్రామస్థాయి బాధ్యతలతో ఆయన జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. గతంలో దేమాంచుపల్లి గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. గ్రామస్థాయి పరిపాలనపై అవగాహనతో పాటు రాజకీయ వ్యవహారాల్లో అనుభవం కలిగిన నాయకుడిగా ఆయనకు స్థానికంగా గుర్తింపు ఉంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ శ్రేణులతో కలిసి రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. చిట్వేలి మండల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలు జడ్పీటీసీ ఎన్నికల్లో కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో ఎల్వీ మోహన్ రెడ్డి అభ్యర్థిత్వం మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా నిలిచింది. దేమాంచుపల్లి పంచాయతీ నుంచి మండల, జిల్లా స్థాయి రాజకీయాల వరకు తనకున్న అనుభవాన్ని ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకుంటూ ముందుకు సాగుతున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలను కలుసుకోవడం, ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తన అభ్యర్థిత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ తరఫున ఎల్వీ మోహన్ రెడ్డి పోటీ చిట్వేలి మండల జడ్పీటీసీ ఎన్నికలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.

# అదే జోరు.. అదే ఆదరణ.. గుత్తి నరసింహులుకు ఊరూరా నీరాజనం

## ఏసీ గుర్తుతో స్వతంత్ర అభ్యర్థిగా ప్రచారం.. ప్రజల ఆదరణే తన బలమంటూ ముందుకు

చిట్వేలి అక్టోబర్ 31 మనం న్యూస్: చిట్వేలి మండల జడ్పీటీసీ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా నిలిచిన గుత్తి నరసింహులుకు గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోంది. రెండో రోజు కూడా అదే ఉత్సాహంతో ఆయన ప్రచారాన్ని కొనసాగించారు. గ్రామాల్లో మహిళలు హారతులు పట్టి స్వాగతం పలుకుతుండగా, అభిమానులు, అనుచరులు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొంటున్నారు. మండలంలోని చెర్లోపల్లి, సిద్ధారెడ్డిపల్లి, కేవీఆర్ పురం, మైలపల్లి, తదితర గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. సుమారు 20 వాహనాల్లో వచ్చిన అభిమానులు, అనుచరులతో పాటు పలువురు గ్రామస్తులు ప్రచారంలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గతంలో తెలుగుదేశం పార్టీ నాయకుడిగా మండలంలోని గ్రామాల్లో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్న



నరసింహులు, కూటమి సీట్ల సర్దుబాటులో చిట్వేలి జడ్పీటీసీ స్థానం జనసేనకు కేటాయించడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆదరణే తన బలమని, ఏసీ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, చిట్వేలి మండల ప్రజల సేవకుడిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో తనకు లభిస్తున్న ఆదరణతో అభిమానులు, అనుచరుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిట్వేలీ మండల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాం

## ఆదరించండి.. ఆశీర్వదించండి: మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

చిట్వేలి అక్టోబర్ 31 మనం న్యూస్: చిట్వేలీ మండల అభివృద్ధికి గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం నగిరిపాడు గ్రామంలో ఆయన పర్యటించారు. ముందుగా గ్రామం లోని రంగనాయకుల స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి గ్రామ ప్రజలు, ఓటర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ.. గతంలో చిట్వేల్ నుంచి రైల్వేకోడూరుకు వెళ్లే రహదారి సింగిల్ లైన్‌గా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయేవారని గుర్తుచేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.45



కోట్ల వ్యయంతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశామని తెలిపారు. అదేవిధంగా చిట్వేల్‌లో నూతన ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించడంతో పాటు, పట్టణ ప్రజలకు రక్షణ కల్పించే విధంగా టౌన్ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం చేపట్టామని వివరించారు. వీటితో పాటు మండలంలోని గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. గతంలో తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తించాలని, గ్రామాల్లోకి వెళ్లి ఓట్లు అడిగే నైతిక హక్కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉందని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఓటు ద్వారా తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, చిట్వేల్ మండల జడ్పీటీసీ అభ్యర్థి ఎల్వీ మోహన్ రెడ్డి, నగిరిపాడు ఎంపీటీసీ అభ్యర్థి ఎలగ చర్ల రెడ్డమ్మ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మలిశెట్టి వెంకట రమణ, చిట్వేలీ మాజీ ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు శివారెడ్డి, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి లింగం లక్ష్మీకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నాగిరెడ్డి, బాబు రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భీము మంజుల గెలుపే లక్ష్యంగా కూటమి నాయకుల విస్తృత ప్రచారం

చిట్వేలీ అక్టోబర్ 31 మనం న్యూస్: ఉమ్మడి మైలపల్లి ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంటోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మైలపల్లి పంచాయతీ పరిధిలోని బట్టువారిపల్లి, నడింపల్లి, గొల్లపల్లి హరిజనవాడ, ఎం.వడ్డిపల్లి గ్రామాల్లో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పర్యటించి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి మద్దతుతో ఉమ్మడి మైలపల్లి ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భీము మంజుల విజయాన్ని ఆకాంక్షిస్తూ కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా సైకిల్



గుర్తుకు ఓటు వేసి ఎంపీటీసీ అభ్యర్థి భీము మంజులకు మద్దతు తెలపాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాల్లో పర్యటించిన నాయకులు స్థానిక ప్రజలతో మమేకమై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచార కార్యక్రమంలో పాల్గొని అభ్యర్థికి తమ మద్దతును తెలియజేశారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో కూటమి శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని ఎన్నికల వాతావరణాన్ని మరింత వేడెక్కించారు. ఉమ్మడి మైలపల్లి ఎంపీటీసీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలను కలుస్తూ తమ అభ్యర్థికి మద్దతు కోరుతూ ప్రచారాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు స్థానిక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# ప్రొద్దుటూరులో రాజకీయ కలకలం

## రాచమల్లుతో విభేదాలనే ప్రచారాన్ని ఖండించిన పోరెడ్డి నరసింహారెడ్డి



ప్రొద్దుటూరు మనంన్యూస్ :అక్టోబర్ (31) మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి, తనకు మధ్య విభేదాలు సృష్టించేందుకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చేస్తున్న ప్రయత్నాలు తగవని వైసీపీ నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి స్పష్టం చేశారు. శనివారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తమ మధ్య విభేదాలు ఉన్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని, ఎవరూ తమను దూరం చేయలేరని తేల్చిచెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలకు పాల్పడ్డారని, నామినేషన్లు వేయకుండా పోలీసులను అడ్డంపెట్టి వైయస్సార్‌సీపీ అభ్యర్థులను ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఓసీ కేటగిరీకి అవకాశం వస్తే తనను, మహిళకు అయితే రాచమల్లు రమాదేవిని నిలపాలని పార్టీ ముందుగానే నిర్ణయించిందని తెలిపారు. తనకు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ?ఈ సమావేశంలో వైయస్సార్‌సీపీ నాయకులు కాకర్ల నాగశేషారెడ్డి, శౌరి సుభాష్‌రెడ్డి, ద్వార్శల గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థి కోనేటి రాజేశ్వరి గెలుపే లక్ష్యంగా ప్రచారం



పెనగలూరు(అక్టోబర్ 31), మనంన్యూస్: శింగారెడ్డిపల్లి ఎంపిటిసి కూటమి జనసేన అభ్యర్థి కోనేటి రాజేశ్వరి, టీడీపీ జడ్పిటీసి అభ్యర్థి దాసరి సుభాషిణి గెలుపే లక్ష్యంగా జోరుగా ప్రచారం జరుగుతోంది. శనివారం శింగారెడ్డిపల్లి ఎంపీటీసి పరిధిలోని ఎన్ ఆర్ పురం పంచాయతీలో కూటమి అభ్యర్థుల తరుపున టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ మారంరెడ్డి లక్ష్మీ నరసయ్య, కత్తి సుబ్బరాయుడు, అజయ్, మదన్, లింగం నరేష్, కాకి శ్రీరాములు, రాచూరి నరసింహులు,జనసేన యువ నాయకుడు అలిశెట్టి నవీన్, పలువురు కూటమి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి ఎంపిటిసికి గాజు గ్లాసు గుర్తు కు, జడ్పిటీసి కి సైకిల్ గుర్తు కు ఓటు వేయాలని కోరారు.



## ఏకగ్రీవ ఎన్నికైన ఎంపీటీసీ సుభాషిణికి అభినందనలు

సిద్ధవటం, అక్టోబర్ 31: మనం న్యూస్ : సిద్ధవటం మండలం మాధవరం–1 ఎంపీటీసీగా రవిశంకర్ సతీమణి సుభాషిణి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య తన సతీమణితో కలిసి రవిశంకర్ దంపతులను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లా ఇంటెలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడు, అడ్వకేట్ షేక్ నాయబ్ రసూల్ సైతం సుభాషిణికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాటాల రామయ్య మాట్లాడుతూ, సుభాషిణి ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. మన ఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్‌గా, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శిగా రవిశంకర్ అందిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పట్ల స్పందిస్తూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఆయన సేవాభావాన్ని ప్రశంసించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సుభాషిణి గ్రామంలోని సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధిగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల ఆదరాభిమానాలు పొందాలని రాటాల రామయ్య, అడ్వకేట్ షేక్ నాయబ్ రసూల్ అభిలషించారు.

## ఆలస్య జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి కొత్త నిబంధనలు

### తహసీల్దార్ విజయ్ కుమార్



సిద్ధవటం అక్టోబర్ 31(మనంన్యూస్) :జనన, మరణాల నమోదు విషయం లో ప్రభుత్వం కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చిందని సిద్ధవటం తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. జననం జరిగిన 21 రోజుల్లోపు సంబంధిత ఆసుపత్రిలోనే జనన ధ్రువీకరణ పత్రం పొందవచ్చన్నారు. రెండు సంవత్సరాల లోపు ఆలస్యంగా నమోదు చేసుకోవాల్సి వస్తే తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తును ఆర్డీఓ కార్యాలయానికి పంపి, ఆర్డీఓ ద్వారా ధ్రువీకరణ పత్రం జారీ అవుతుందని వివరించారు. పార్లమెంట్ ఆమోదించిన చట్ట నిబంధనల ప్రకారం ఆలస్యమైన జనన, మరణాల నమోదు ప్రక్రియలో మార్పులు తీసుకొచ్చారని, ఈ నిబంధనలు 2026 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

## జడ్పీటీసీ అభ్యర్థి కీర్తిపాటి కవిత గారి అఖండ విజయాన్ని కాంక్షిస్తూ ముక్కా వరలక్ష్మి ప్రచారం



ఓబులవారిపల్లి, అక్టోబర్ 31, మనం న్యూస్:ఓబులవారిపల్లి మండలంలోని సీఎం బలిజపల్లి గ్రామంలో జడ్పీటీసీ అభ్యర్థి కీర్తిపాటి కవిత విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా కొనసాగింది. రైల్వే కోడూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థి కవిత గారికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఘన విజయం అందించాలని ఆమె ప్రజలను కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థుల విజయమే బలమైన పునాది అవుతుందని వివరించారు. ముక్కా వరలక్ష్మి కి గ్రామ ప్రజలు, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలుకుతూ ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కవిత గారి విజయమే లక్ష్యంగా.. గ్రామంలో సైకిల్ జోరు పెంచుతూ టీడీపీ శ్రేణులు ముందుకు సాగాయి.

## ఘనంగా పోలీసు అమరవీరుల వారోత్సవాలు



అక్టోబర్ 31 మనం న్యూస్: ఏపియస్పీ 11వ బెటాలియన్ పోలీసు అమరవీరుల వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ కె ఆనందరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని పోలీసు సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అమరులైన పోలీసుల పేర్లను స్మరిస్తూ నినాదాలు చేస్తూ వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పి. రాజశేఖర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# వీవీ కండ్రికలో వైఎస్సార్‌సీపీ ప్రచారం


### ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని సంటి వెంకటయ్య విజ్ఞప్తి



రైల్వేకోడూరు, అక్టోబర్ 31, మనం న్యూస్
తిరుపతి జిల్లా రైల్వేకోడూరు మండల పరిధిలోని వీవీ కండ్రిక ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సంటి వెంకటయ్య విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గత మూడు రోజులుగా వీవీ కండ్రిక పరిధిలోని ప్రతి గడపకూ తిరుగుతూ, ఓటర్లను నేరుగా కలిసి ఫ్యాన్ గుర్తుకే తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆత్మీయంగా అభ్యర్థిస్తున్నారు. ప్రచారంలో భాగంగా సంటి వెంకటయ్య మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి మాత్రమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రైల్వేకోడూరు మండల జెడ్పీటీసీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అంబటి మురళికి, అలాగే ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, ఇరువురినీ భారీ మెజార్టీతో గెలిపించి ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని ఓటర్ మహాశయులను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థులకు మద్దతు తెలిపారు.

## ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి అన్నప్రసాదానికి రూ.10 లక్షల విరాళం



ఒంటిమిట్ట అక్టోబర్ 31(మనం న్యూస్) : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహణ కోసం టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు రూ.10,01,116 విరాళంగా అందజేశారు. ఈ మేరకు శనివారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో టిటిడి బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు తన సతీమణితో కలిసి కలిసి విరాళానికి సంబంధించిన డీడీని కార్యనిర్వహణాధికారి ముద్దాడ రవిచంద్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట ఉప కార్యనిర్వహణాధికారి ఎ. ప్రశాంతి పాల్గొన్నారు.

# అమెరికా ఎన్నికలు: భారతీయ ఓటర్ల కోసం దోసెలు వేస్తున్న అభ్యర్థులు!

### యూఎస్ మధ్యంతర ఎన్నికల్లో భారతీయ ఓటర్లపై నేతల ప్రత్యేక దృష్టి
### ఆకట్టుకునేందుకు దోసెలు వేస్తూ.. దీపావళి వేడుకల్లో పాల్గొంటున్న అభ్యర్థులు
### టెక్సాస్‌లో డెమొక్రాటిక్ అభ్యర్థికి భారతీయ ఓటర్ల నుంచి గట్టి మద్దతు
### కీలక రాష్ట్రాల్లో ఫలితాలను మార్చగలరన్న అంచనాతో ప్రచార వ్యూహాలు




అమెరికాలో జరుగుతున్న మిడ్‌టర్మ్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు భారతీయ–అమెరికన్ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా, దోసెలు వేయడం, ఆలయాలను సందర్శించడం, దీపావళి వేడుకల్లో పాల్గొనడం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో వారిని ప్రసన్నం చేసుకుంటున్నారు. కొన్ని కీలక రాష్ట్రాల్లో ఈ వర్గం ఓట్లు గెలుపోటములను ప్రభావితం చేయగలవని గుర్తించడమే ఇందుకు ప్రధాన కారణం. ఇటీవల టెక్సాస్‌లో డెమొక్రాటిక్ సెనేట్ అభ్యర్థి జేమ్స్ టలారికో, భారతీయ ఓటర్ల కోసం స్వయంగా దోసె వేశారు. డల్లాస్ సమీపంలోని ఇర్వింగ్‌లో ఉన్న ఓ భారతీయ రెస్టారెంట్‌కు వెళ్లి, పెనంపై పిండి వేసి, ఆలూ కూరతో దోసె తయారు చేసి అరటి ఆకులో వడ్డించారు. ఒక సర్వే ప్రకారం, టెక్సాస్‌లోని సౌత్ ఏషియన్ ఓటర్లలో 66శాతం మంది టలారికోకు మద్దతిస్తుండగా, ఆయన ప్రత్యర్థి, రిపబ్లికన్ కెన్ పాక్స్‌టన్‌కు కేవలం 21 శాతం మాత్రమే అనుకూలంగా ఉన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే తరహా ప్రచారం కనిపిస్తోంది. కనెక్టికట్ గవర్నర్ నెడ్ లమాంట్, ఓహియో కాంగ్రెస్‌మెన్ గ్రెగ్ ల్యాండ్స్‌మన్, న్యూజెర్సీ సెనేటర్ కోరీ బుకర్ వంటి ప్రముఖ నేతలు హిందూ ఆలయాలను సందర్శించడం, దీపావళి వేడుకల్లో పాల్గొనడం వంటి కార్యక్రమాల్లో చురుగ్గా కనిపించారు. కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూజెర్సీ, జార్జియా, పెన్సిల్వేనియా వంటి రాష్ట్రాల్లో భారతీయ–అమెరికన్ల జనాభా గణనీయంగా ఉంది. ముఖ్యంగా జార్జియా, పెన్సిల్వేనియా, మిచిగాన్ వంటి హోరాహోరీ పోటీ ఉండే 'బ్యాటిల్‌గ్రౌండ్' రాష్ట్రాల్లో వీరి ఓట్లు అభ్యర్థుల గెలుపోటములను శాసించే అవకాశం ఉంది. అందుకే, కొద్ది శాతం ఓట్లైనా ఫలితాలను మార్చేస్తాయన్న అంచనాతో అభ్యర్థులు ఈ వర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గత ఏడాది కాలంలో తమ జాతి, మతం, లేదా వలస నేపథ్యం కారణంగా ద్వేషపూరిత సంఘటనలు ఎదుర్కొన్నామని 58 శాతం మంది సౌత్ ఏషియన్లు చెప్పడం గమనార్హం. ఈ పరిణామం కూడా వారిని డెమొక్రాట్ల వైపు మొగ్గు చూపేలా చేస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పేపర్ స్ట్రాలే ప్లాస్టిక్ కంటే ప్రమాదకరమా? తాజా అధ్యయనంలో సంచలన విషయాలు!

ప్లాస్టిక్ స్ట్రాల వల్ల పర్యావరణానికి ముప్పు అని భావించి.. వాటి స్థానంలో పేపర్ స్ట్రాలను వాడుతున్నారా? అయితే ఓసారి ఆలోచించాల్సిందే! పర్యావరణహితమని భావిస్తున్న పేపర్ స్ట్రాల వల్ల కూడా సమస్యలు తలెత్తుతున్నాయని దక్షిణ కొరియాలో నిర్వహించిన తాజా అధ్యయనం వెల్లడించింది. కొన్ని పర్యావరణ ప్రభావాల విషయంలో ఇవి సంప్రదాయ ప్లాస్టిక్ స్ట్రాల కంటే ఎక్కువ హాని కలిగిస్తున్నట్లు గుర్తించింది.

### క్యాన్సర్ ప్రభావ సూచికలో 6.33 రెట్లు ఎక్కువ

దక్షిణ కొరియా వాతావరణ, ఇంధన, పర్యావరణ మంత్రిత్వ శాఖ ఈ అధ్యయనాన్ని చేయించింది. పీపుల్స్ పవర్ పార్టీ ఎంపీ కిమ్ వి–సాంగ్ అక్టోబర్ 21న దీని వివరాలను వెల్లడించారు. సంప్రదాయ ప్లాస్టిక్, పేపర్, జీవ విచ్ఛిన్నమయ్యే ప్లాస్టిక్, మొక్కల ఆధారిత పాలిథిలీన్ స్ట్రాల ప్రభావాలను పరిశోధకులు పోల్చారు. తయారీ నుంచి వినియోగం, వ్యర్థాల తొలగింపు వరకు మొత్తం



జీవిత చక్రాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో పేపర్ స్ట్రాల క్యాన్సర్ కారక ప్రభావ సూచిక ప్లాస్టిక్ స్ట్రాలతో పోలిస్తే 6.33 రెట్లు ఎక్కువగా నమోదైంది.

### పేపర్ స్ట్రాల కంటే మరో రకం మరింత ప్రమాదకరం

మొక్కల నుంచి తయారు చేసే బయో–బేస్డ్ పాలిథిలీన్ (బయో–పీఈ) స్ట్రాల ప్రభావ సూచిక ప్లాస్టిక్‌తో పోలిస్తే 16.18 రెట్లు ఎక్కువగా ఉంది. జీవ విచ్ఛిన్నమయ్యే ప్లాస్టిక్ స్ట్రాల్లో ఈ సూచిక 3.34 రెట్లుగా నమోదైంది. అయితే ఇవి స్ట్రాలను ఉపయోగించే వ్యక్తులకు నేరుగా క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని సూచించే గణాంకాలు కావు. ఉత్పత్తుల తయారీ, వినియోగం, వ్యర్థాల నిర్వహణ సమయంలో వెలువడే ఉద్గారాల ఆధారంగా అంచనా వేసిన ప్రభావాలు మాత్రమే.

### రీసైక్లింగ్ చేయడంలోనూ ఇబ్బందులే

స్ట్రాలు ఏ పదార్థంతో తయారైనా వాటిని రీసైక్లింగ్ చేయడం కష్టమేనని అధ్యయనం పేర్కొంది. వాటి చిన్న పరిమాణం కారణంగా వ్యర్థాల వేర్పాటు కేంద్రాల్లో గుర్తించి వేరు చేయడం కష్టమవుతోంది. పూతలు, అంటుకునే పదార్థాలు కూడా రీసైక్లింగ్‌కు అడ్డంకిగా మారుతున్నాయి. అందుకే స్ట్రాల పదార్థాన్ని మార్చడం ఒక్కటే పరిష్కారం కాదని పరిశోధకులు సూచించారు. దుకాణాల్లో అడగకుండానే డిస్పోజబుల్ స్ట్రాలు ఇవ్వకుండా, వినియోగదారులు కోరినప్పుడు మాత్రమే అందించాలని సిఫారసు చేశారు.